
# కార్యకర్తలకు అండగా బీఆర్ఎస్

దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి

మిరుదొడ్డి (అక్బర్‌పేట–భూంపల్లి), డిసెంబర్ 18: కార్యకర్తలకు ఎప్పుడూ అండగా ఉంటానని దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి అన్నారు. సోమవారం అక్బర్‌పేట–భూంపల్లి మండలంలోని బేగంపేట గ్రామంలో ఇటీవల బీఆర్ఎస్ కార్యకర్త కాపర్ల నర్సింహులు మృతి చెందడంతో బాధిత కుటుంబానికి పార్టీ సభ్యత్వం కింద మంజూరైన రూ.2 లక్షల బీమా చెక్కును అందజేశారు. బేగంపేట సర్పంచ్ పోతారం అనసూయ ప్రతాప్, సర్పంచ్‌ల ఫోరం మిరుదొడ్డి ఉమ్మడి మండల అధ్యక్షుడు తుమ్మల బాల్‌రాజు, మోతె సర్పంచ్ కాలేరు శ్రీనివాస్, మాజీ ఎంపీపీ బోరం యాదయ్య, భూపాల్ తదితరులు పాల్గొన్నారు.



మిరుదొడ్డి: రూ.2 లక్షల బీమా చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి

### బాలాజీ ఆలయంలో ఎమ్మెల్యే పూజలు

దుబ్బాక, డిసెంబర్ 18: దుబ్బాక పట్టణంలోని బాలాజీ ఆలయంలో స్వామివారిని ఎమ్మెల్యే ప్రభాకర్‌రెడ్డి దర్శించుకున్నారు. వైకుంఠ ఏకదశికి జరుగుతున్న ఏర్పాట్లపై ఆరా తీశారు. అనంతరం అయ్యప్ప మహా పడిపూజలో పాల్గొన్నారు.

## ఇందుప్రియాల్‌లో ఎమ్మెల్యేకు ఘన సన్మానం

రాయపోల్, డిసెంబర్ 18: దౌల్తాబాద్ మండలం ఇందుప్రియాల్ గ్రామస్తులు దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డిని ఆయన నివాసంలో కలిసి సన్మానించారు. తనకు ఓట్లు వేసి గెలిపించిన ప్రతి కార్యకర్తకు రుణపడి ఉంటానని ఎమ్మెల్యే అన్నారు. కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ వెంకటరెడ్డి, ఎంపీటీసీ మల్లేశం, సర్పంచ్ శ్యామలాకుమార్, బీఆర్ఎస్ జిల్లా మైనార్టీ నాయకుడు షాదుల్లా పాల్గొన్నారు.



## రోడ్డు విస్తరణను నిరసిస్తూ నిరసన

సిద్దిపేట అర్బన్, డిసెంబర్ 18: మండలపరిధిలోని మిట్టపల్లి గ్రామ రైతువేదిక వద్ద రోడ్డు విస్తరణను నిరసిస్తూ గ్రామస్తులు రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మిట్టపల్లి గ్రామం మీదుగా నిర్మిస్తున్న ఫోర్ లేన్ రోడ్డు పనులు పాత మార్క్ ప్రకారం 100 ఫీట్లు ఉంటుందని చెప్పి.. ప్రస్తుతం 150 ఫీట్లు మార్కింగ్ చేస్తున్నారని మండిపడ్డారు. దీంతో తమ ఇండ్లతోపాటు ఖాళీగా ఉన్న ప్లాట్లు కూడా నష్టపోతామన్నారు. 100 మీటర్లకే రోడ్డు నిర్మాణం చేపట్టాలని, 600 మీటర్లు కాకుండా 300 మీటర్లతో బ్రిడ్జి నిర్మించాలని డిమాండ్ చేశారు. గతంలో రైల్వే లైన్‌లో భూములు పోగొట్టుకున్నామని.. అందులో వచ్చిన డబ్బులతో ఇప్పుడు ఇండ్లు నిర్మించి, ప్లాట్లు కొనుక్కుంటే ఇప్పుడు మళ్లీ రోడ్డుతో నష్టపోతున్నామని వాపోయారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించి తమకు న్యాయం చేయాలని కోరారు.

## అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

సిద్దిపేట అర్బన్, డిసెంబర్ 18: అనుమానాస్పదంగా ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన మండలపరిధిలోని తడ్కపల్లి గ్రామంలో ఆదివారం రాత్రి చోటు చేసుకున్నది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. తడ్కపల్లి గ్రామానికి చెందిన దండు శ్రీనివాస్(35) అదే గ్రామానికి చెందిన కొంత మంది స్నేహితులతో కలిసి పేకాట ఆడుతున్న క్రమంలో గొడవ జరిగింది. గొడవ అనంతరం అక్కడి నుంచి అందరూ వెళ్లిపోగా.. అక్కడే స్పృహ కోల్పోయి పడిపోయిన శ్రీనివాస్ అదే గ్రామానికి చెందిన మరో వ్యక్తి ఇంటికి తీసుకెళ్లారు. అక్కడి నుంచి దవాఖానకు తరలించారు. అప్పటికే శ్రీనివాస్ మృతి చెందినట్టు వైద్యులు నిర్ధారించారు. పేకాట సందర్భంలో జరిగిన ఘర్షణలో తన భర్త మృతి చెందాడని అతడి భార్య రాధ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

## వాటర్ ప్లాంట్ ప్రారంభం

తొగుట, డిసెంబర్ 18: బాల వికాస నీటిశుద్ధీకరణ పథకం సోలార్ ప్యాక్ వారి ఆర్థిక సహాయం, బాలవికాస సహకారంతో మండలంలోని పెద్దమాసాన్‌పల్లి గ్రామంలో సోమవారం సంస్థ ప్రతినిధులు రాంచంద్రా రెడ్డి, సోలార్ ప్యాక్ ఇండియా అధికారి ప్రతాప్‌రెడ్డి, సర్పంచ్ స్వామి తదితరులు వాటర్ ప్లాంట్‌ను ప్రారంభించారు. గ్రామస్తులు నీటి శుద్ధికేంద్రాన్ని సద్వినియోగం చేసుకోలని కోరారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్, బాలవికాస సంస్థ కో ఆర్డినేటర్ శ్రీనివాసరావు, ప్రసాద్ పాల్గొన్నారు.

## మగ్గం వర్క్‌లో ఉచిత శిక్షణ

తొగుట, డిసెంబర్ 18: నాబార్డు సహకారంతో ఐడియల్ రూరల్ డెవలప్మెంట్ సొసైటీ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఘనపూర్ గ్రామంలో ఉచిత మగ్గం శిక్షణ కేంద్రాన్ని సర్పంచ్ కుంభ వెంకటమ్మ, ఎంపీటీసీ శరత్ ప్రారంభించారు. మహిళలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఏపీఎం మగ్దుమ్ అలీ, సీసీ శ్రీనివాస్, రాజశేఖర్, మమత పాల్గొన్నారు.

## పాఠశాలకు ఎన్నారై ఆర్థికసాయం

హుస్నాబాద్‌టౌన్, డిసెంబర్ 18: హుస్నాబాద్ పట్టణంలోని శ్రీసరస్వతీ శిశుమందిర్ ఉన్నత పాఠశాలకు హుస్నాబాద్‌కు చెందిన ఎన్నారై ఎర్రం రఘునందన్‌రెడ్డి రూ.లక్షా యాభై వేలు ఆర్థికసహాయాన్ని సోమవారం అందించారు. ఈ సందర్భంగా సహాయం అందించిన రఘునందన్‌రెడ్డిని పాఠశాల కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు.

## మొక్కు చెల్లించుకున్న బీఆర్ఎస్ నేతలు

చేర్యాల, డిసెంబర్ 18: జనగామ ఎమ్మెల్యేగా పల్లా రాజేశ్వర్‌రెడ్డి విజయం సాధించడంతో మండలంలోని కడవేర్గు గ్రామంలోని దేవాలయాల్లో సోమవారం బీఆర్ఎస్ నాయకులు మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా ఎంపీటీసీల ఫోరం రాష్ట్ర కార్యదర్శి గదరాజు యాదగిరి ఆధ్వర్యంలో బీఆర్ఎస్ నాయకులు 116 కొబ్బరికాయలు కొట్టి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ గ్రామ అధ్యక్షుడు పొన్న సిద్దులు, నాయకులు కందుకూరి సత్తయ్య తదితరులున్నారు.

## పింఛన్‌దారులకు మెరుగైన సేవలు

సిద్దిపేట టౌన్, డిసెంబర్ 18: పింఛన్‌దారులకు అండగా ఉంటామని సిద్దిపేట జిల్లా ట్రెజరీ అధికారి బాలరాజు అన్నారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో సోమవారం పింఛన్‌దారుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పెన్షనర్లకు తమ శాఖ పరంగా అన్ని రకాలుగా మెరుగైన సేవలు అందిస్తామన్నారు. సకాలంలో పింఛన్‌దారులు జీవన ప్రమాణ పత్రాలను సమర్పించాలని కోరారు. కార్యక్రమంలో చంద్రారెడ్డి, బ్యాంక్ మేనేజర్ మంజిత్ కౌర్, మహంకాళి, రాజిరెడ్డి, భూంరెడ్డి, ఎల్లారెడ్డి, సత్యం తదితరులు పాల్గొన్నారు.

## నేడు ఎమ్మెల్యే 'పల్లా' పర్యటన

చేర్యాల/కొమురవెల్లి, డిసెంబర్ 18: ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి మంగళవారం చేర్యాలలో పర్యటించనున్నట్లు ఎంపీపీ వుల్లంపల్లి కరుణాకర్, బీఆర్ఎస్ చేర్యాల పట్టణ అధ్యక్షుడు ముస్త్యాల నాగేశ్వర్‌రావు సోమవారం ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని రైతువేదికలో కల్యాణలక్ష్మి చెక్కులను ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి లబ్ధిదారులకు అందజేస్తారని పేర్కొన్నారు. కొమురవెల్లి మండల కేంద్రంలోని టీటీడీ కల్యాణ మండపంలో కల్యాణ లక్ష్మి చెక్కులను పంపిణీ చేయనున్నారు.

# అధికారులు సమన్వయంతో పని చేయాలి

నారాయణరావుపేట, డిసెంబర్ 18: అధికారులు సమన్వయంతో పని చేసి గ్రామాల అభివృద్ధికి కృషి చేయాలని ఎంపీపీ ఒగ్గు బాలకృష్ణ అన్నారు. సోమవారం మండలకేంద్రమైన నారాయణరావుపేట గ్రామ పంచాయితీ భవనంలో మండల సర్వసభ్య సమావేశం జరిగింది. వైద్య, విద్య, రెవెన్యూ, విద్యుత్ శాఖలపై చర్చించారు. ఈ సందర్భంగా అధికారుల పనితీరు సరిగా లేదని మండల ప్రజాప్రతినిధులు ఆరోపించారు. అనంతరం ఎంపీపీ మాట్లాడుతూ.. మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు సహకారంతో మండలాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దామన్నారు. అభివృద్ధిలో గ్రామాల మధ్య పోటీతత్వం ఉండాలన్నారు. ఆయా గ్రామాల సర్పంచ్‌లు మాట్లాడుతూ.. ఎన్నికైన ఐదేండ్లలో ప్రజలకు మెరుగైన సేవలు అందించామని తెలిపారు. సహకరించిన అధికారులు, తోటి ప్రజాప్రతినిధులకు కృతజ్ఞతలు తెలిపారు. జడ్పీటీసీ లక్ష్మి, ఎంపీడీఓ మురళీధర్‌శర్మ, తహసీల్దార్ లక్ష్మారెడ్డి, వైస్ ఎంపీపీ సంతోష్‌కుమార్, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీపీ ఒగ్గు బాలకృష్ణ

# వచ్చే ఎన్నికల్లో బీజేపీకి బుద్ధి చెబుతాం

చేర్యాల, డిసెంబర్ 18: కేంద్రంలో అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లో ఎస్సీ వర్గీకరణ చేసి పార్లమెంట్‌లో బిల్లు ప్రవేశపెడుతామని హామీ ఇచ్చి నెరవేర్చని బీజేపీని మాదిగలు వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో బుద్ధి చెప్పడం ఖాయమని ఎమ్మార్పీఎస్–టీఎస్ జిల్లా అధ్యక్షుడు భూమిగారి రాజేందర్ అన్నారు. డిసెంబర్ 21న ఢిల్లీలో ఎస్సీ వర్గీకరణ చేయాలని డిమాండ్ చేస్తూ తలపెట్టిన మహాధర్నాకు సంబంధించిన కరపత్రాలను సోమవారం పట్టణంలో జరిగిన కార్యక్రమంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు మాట్లాడుతూ మోసపూరిత వాగ్దానాలతో కాలం వెల్లదీస్తున్న బీజేపీకి గుణపాఠం తప్పదన్నారు. ఎస్సీ వర్గీకరణపై బిల్లు పెట్టి వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి రాజేందర్, నాయకులు వెంకన్న, కృష్ణ, ఎల్లం, వెంకటేష్, పరశురాములు, రాజమల్లయ్య, మహేశ్, స్వామి పాల్గొన్నారు.

# ఘనంగా సుబ్రహ్మణ్య స్వామి కల్యాణోత్సవం



వర్గల్: కల్యాణం జరిపిస్తున్న వేదపండితులు

వర్గల్/హుస్నాబాద్‌టౌన్/కొండపాక(కుకునూరుపల్లి), డిసెంబర్ 18: వర్గల్ విద్యా సరస్వతీ క్షేత్రాల్లో ఉప దేవాలయమైన శ్రీవల్లీదేవసేనా సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి షష్ఠి మహోత్సవ వేడుకలు సోమవారం నేత్రపర్వంగా జరిగాయి. కార్యక్రమంలో భాగంగా ఆలయ వ్యవస్థాపక అధ్యక్షుడు బ్రహ్మశ్రీ శ్రీయాయవరం చంద్రశేఖరశర్మసిద్ధాంతి ఆధ్వర్యంలో వేదపండితులు మూలవరులకు విశేష అభిషేకాలు నిర్వహించారు. హుస్నాబాద్‌లోని సిద్ధేశ్వరస్వామి గుట్టపై నిర్మించిన అయ్యప్పస్వామి ఆలయంలో సోమవారం సుబ్రహ్మణ్యస్వామి షష్ఠిని పురస్కరించుకొని ప్రత్యేక పూజలు చేశారు. పార్వతీపరమేశ్వరుల ద్వితీయ పుత్రుడైన సుబ్రహ్మణ్యస్వామి షష్ఠి కార్యక్రమాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. కొండపాక మండలంలోని మర్పడగలోని విజయదుర్గా సమేత సంతాన మల్లికార్జున స్వామి క్షేత్రంలో సుబ్రహ్మణ్యస్వామి కల్యాణోత్సవం కనులపండువగా జరిగింది.

## విద్యార్థుల హాజరుశాతం పెంచాలి

సిద్దిపేట అర్బన్, డిసెంబర్ 18: విద్యార్థుల హాజరుశాతం పెంచాలని సిద్దిపేట అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్ ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో ఎంఈఓ, ఎంఎన్ఓ, సీహెచ్ఎస్, ఉపాధ్యాయ అధికారులతో సమావేశమయ్యారు. వచ్చే మూడు నెలలు ఉపాధ్యాయులు సెలవు తీసుకోకుండా పని చేయాలన్నారు. పిల్లలకు సులభంగా అర్థమయ్యేలా పాఠ్యాంశాలు బోధించాలన్నారు. పది ఫలితాల్లో జిల్లాను అగ్రగామిగా నిలిపేందుకు అన్ని చర్యలు తీసుకోవాలన్నారు. డీఈఓ శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా సంక్షేమ అధికారి రాంగోపాల్ రెడ్డి పాల్గొన్నారు.

## పట్టు రైతుల ఆందోళన

సిద్దిపేట అర్బన్, డిసెంబర్ 18: సికింద్రాబాద్‌లోని తిరుమలగిరి పట్టు గూళ్ల మార్కెట్ ఎదుట సోమవారం సిద్దిపేట జిల్లా పట్టు రైతు సంఘం ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. నాణ్యమైన పట్టుగూళ్లు తీసుకెళ్తున్నప్పటికీ సరైన ధర రావడం లేదని ఆరోపించారు. విక్రయించిన గూళ్లకు నెలల తరబడి డబ్బులు ఇవ్వకుండా ఇబ్బంది పెడుతున్నారని వాపోయారు. ఇప్పటికైనా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమం లో జిల్లా పట్టు రైతు సంఘం అధ్యక్షుడు ఐలయ్య, సభ్యులు రాజు, నర్సింలు, శ్రీనివాస్, తులసిరామ్, రమేశ్, రవీందర్ పాల్గొన్నారు.

## యాసంగికి నీటి విడుదల

కోహెడ, డిసెంబర్ 18: యాసంగికి సంబంధించి 4,044 ఎకరాల ఆయకట్టుకు మండలంలోని శనిగరం ప్రాజెక్టు నుంచి సోమవారం ఎంపీపీ కీర్తి నీటిని విడుదల చేశారు. ఆమె వెంట బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి కర్ర శ్రీహరి, మాజీ సర్పంచ్ కర్ర రవీందర్, తంగళ్లపల్లి ఎంపీటీసీ శేఖర్, మాజీ కోఆప్షన్ సభ్యుడు అబ్దుల్ రహీం, తిమ్మాయపల్లి ఉపసర్పంచ్ యాదగిరి, డీఈ, ఏఈ ఉన్నారు.

## పంచాయతీ రికార్డుల పరిశీలన

చిన్నకోడూరు, డిసెంబర్ 18: మండలంలోని మాచాపూర్ పంచాయతీ రికార్డులను కౌన్సిల్ ఫర్ సిటిజన్ రైట్స్(సీసీఆర్) సంస్థ ఆధ్వర్యంలో సోమవారం తనిఖీ చేశారు. సమాచార హక్కు చట్టం జిల్లా అధ్యక్షుడు గుండ్ల శివచంద్రం గతంలోనే రికార్డుల తనిఖీకి అనుమతి పొందామన్నారు. సీసీఆర్ సెంట్రల్ కమిటీ సభ్యుడు చంద్రకాంత్ మాట్లాడుతూ తనిఖీల్లో అవకతవకలు గుర్తిస్తే ఉన్నతాధికారులకు నివేదిక అందిస్తామన్నారు. సంస్థ సభ్యులు భరద్వాజ్, ఫరూఖ్, అలీ, రత్నాకర్, రాజు, ఆంజనేయులు పాల్గొన్నారు.

## చేర్యాల ఎస్ఐగా దామోదర్

చేర్యాల, డిసెంబర్ 18: చేర్యాల ఎస్ఐగా వద్దాటి దామోదర్‌ను సంబంధిత శాఖ ఉన్నతాధికారులు నియమించారు. చేర్యాల ఎస్‌హెచ్‌వోగా భాస్కర్‌రెడ్డి విధులు నిర్వహిస్తున్న క్రమంలో దామోదర్‌ను ఇక్కడకు పంపించారు. దామోదర్ దుబ్బాక్ ఎస్ఐగా విధులు నిర్వహిస్తున్నారు. ఆదివారం రాత్రి చేర్యాల ఎస్‌హెచ్‌వోగా దామోదర్ బాధ్యతలు స్వీకరించారు.

## శ్రీగిరిపల్లిలో వైద్య శిబిరం

గజ్వేల్, డిసెంబర్ 18: మండలపరిధిలోని శ్రీగిరిపల్లిలో బాచుపల్లికి చెందిన మమత దవాఖానకు చెందిన వైద్యులు గ్రామంలో సోమవారం ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు చెరుకు చంద్రమోహన్‌రెడ్డి డాక్టర్ గౌతమితో కలిసి శిబిరాన్ని ప్రారంభించారు.

## మంత్రిని కలిసిన 'మల్లన్న' అర్చకులు

చేర్యాల, డిసెంబర్ 18: బీసీ సంక్షేమ శాఖ మంత్రిగా బాధ్యతలు తీసుకున్న సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్‌ను కొమురవెల్లి మల్లన్న ఆలయ ఈవో బాలాజీ, అర్చకులు సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. కార్యక్రమంలో ఆలయ స్థానాచార్యులు పడిగన్నగారి మల్లేశం, ప్రధానార్చకుడు మహాదేవుని మల్లికార్జున్, ఆలయ అర్చకులు రవి, శివప్రసాద్ ఉన్నారు.

## ఆటో కార్మికుల నిరసన ర్యాలీ

కొండపాక(కుకునూరుపల్లి), డిసెంబర్ 18: మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించడంతో తీవ్రంగా నష్టపోతున్నామని కొండపాక మండలంలోని దుద్దెడ ఆటో డ్రైవర్లు మెయిన్ రోడ్డు నుంచి అంబేద్కర్ చౌరస్తా వరకు సోమవారం ర్యాలీ చేపట్టారు. ప్రతి ఆటో డ్రైవర్‌కు నెలకు రూ.15వేల జీవన భృతిని ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు ఆరేళ్ల నర్సింహులు, ఆరేపల్లి అంజి, కాటపాల లింగం పాల్గొన్నారు.



దుద్దెడలో నిరసన తెలుపుతున్న ఆటోడ్రైవర్లు